# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన 10 అత్యవసర చికిత్స కేంద్రాలను, 12 సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కలిసి ఈరోజు ప్రారంభించనున్నారు.**

2. **విద్య ఒక్కటే ప్రజల జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందనే సంపూర్ణ విశ్వాసంతో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

3. **గిరిజన ప్రాంతాల్లో అవసరమైన వసతులు కల్పించడం ద్వారా చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు.**

4. **ఉద్యోగులు, పింఛనుదారులకు కరువు భత్యం బకాయిల్లో రెండింటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.**

==========================

రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన 10 అత్యవసర చికిత్స కేంద్రాలను, 12 సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఈ రోజు ప్రారంభించనున్నారు. మొత్తం 22 ప్రాజెక్టులకు 249 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. వీటిని విజయవాడలోని బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఈ 10 అత్యవసర చికిత్స కేంద్రాల ద్వారా 5 వందల పడకలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్‌తో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల సేవలు అందుతాయని అధికారులు తెలిపారు.

-----------------------

మాదక ద్రవ్యాల నిర్మూలన, మహిళలపై నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా 'త్రిశూల్' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కమిటీల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో రెండవ రోజైన నిన్న శాంతి భద్రతలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై నేరాలు లేకుండా చేయడం, ప్రమాదాల నివారణ లక్ష్యంగా త్రిసూల్ కమిటీలు పని

చేయాలన్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగి తప్పు చేసినా, ప్రభావం ప్రభుత్వంపై పడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఎవరు తప్పు చేసిన చర్య తీసుకునే పరిస్థితి రావాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

విద్య ఒక్కటే ప్రజల జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందనే సంపూర్ణ విశ్వాసంతో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా విధానంపై శాసనసభలో నిన్న జరిగిన స్వల్పకాలిక చర్చకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక వెనుకబాటుతనానికి ఆస్తులు, అంతస్తులు కారణం కాదని, నిరక్షరాస్యతే ప్రధాన కారణమని ప్రభుత్వం నిర్వహించిన సీపెక్ సర్వేలో తేలిందని వెల్లడించారు. తెలంగాణకు నూతన విద్యా విధానాన్ని రూపొందించేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం ఏటా లక్షా 8 వేల రూపాయలను ఖర్చు చేస్తోందని పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 24 అత్యవసర చికిత్స కేంద్రాలను మంజూరు చేసిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వీటి కోసం సుమారు 6 వందల కోట్ల రూపాయలు కేటాయించిందని వెల్లడించారు. విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మించిన అత్యవసర చికిత్స కేంద్రాలను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా మంజూరు చేసిన 24 అత్యవసర చికిత్సా కేంద్రాలను 16 ప్రభుత్వ వైద్య కళాశాలల ఆసుపత్రులు, మూడు జిల్లా ఆసుపత్రులు, ఐదు ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాలు పూర్తిగా అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఒక వేయి 275 అదనపు అత్యవసర చికిత్స పడకలు సమకూరతాయని వివరించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 10 అత్యవసర చికిత్స కేంద్రాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా ఈరోజు ప్రారంభిస్తారని చెప్పారు.

---------------------------

గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన వసతులు కల్పించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఇప్పటికే చేపట్టిన 25 అంగన్‌వాడీ కేంద్రాల పునరుద్ధరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

---------------------------

ఉద్యోగులు, పింఛనుదారులకు పాత కరువు భత్యం బకాయిల్లో రెండింటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల జీతం, పింఛనుతో కలిపి కరువు భత్యాన్ని చెల్లించనున్నారు. ఇందులో ఒక డిఏ 1.82 శాతం, మరో బకాయి 2.73 శాతంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. 2.73 శాతాన్ని 2024 జూన్ నుంచి లెక్కించి వచ్చే ఏడాది ఏప్రిల్, జూన్, ఆగస్ట్, అక్టోబరు నెలల్లో

చెల్లిస్తారు. 1.82 శాతాన్ని జనవరి 2025 నుంచి లెక్కించి 2028 జనవరి, మార్చి, మే, జూలై నెల్లల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్ సంస్థలు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని బోధన, బోధనేతర సిబ్బందిలో పింఛను పొందుతున్న వారికి కూడా ఈ ప్రయోజనం వర్తిస్తుందని తెలిపారు.

---------------------------

సముద్ర తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ సాగర్–సురక్షిత్ సాగర్ 5.0' కార్యక్రమాన్ని ఈరోజు నుంచి వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. సముద్రాల్లో వ్యర్థాలు, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు ప్రజల భాగస్వామ్యంతో 2022 నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఉద్యమంగా రూపుదిద్దుకుంది. దేశంలో సుమారు 11 వేల 98 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్నట్లు భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 14 తీర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తీర ప్రాంత పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించింది. అలాగే సముద్ర పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయాలని, ఇందుకు 'సాగర్ ప్రహరి' మొబైల్ యాప్ వినియోగించాలని కోరింది. సామాజిక మాధ్యమాల్లో స్వచ్ఛ సాగర్ ట్యాగ్ లైన్ తో కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించింది.

---------------------------

తపాలా కార్యాలయాల్లో అందిస్తున్న సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ నెల 23న 'డాక్ అదాలత్' నిర్వహించనున్నట్లు తపాలా శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి.పి. శ్రీదేవి ఆధ్వర్యంలో విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ తపాలా సర్కిల్ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సెప్టెంబరు 22వ తేదీ లేదా అంతకుముందు విజయవాడలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిర్యాదులు)కు పోస్టు ద్వారా పంపించాలని సూచించారు. ఫిర్యాదులు పంపే కవరుపై 'డాక్ అదాలత్' అని స్పష్టంగా పెద్ద అక్షరాలతో రాయాలని తెలిపారు. ఫిర్యాదుదారుల కోసం ఈనెల 23 వ తేదీన ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

---------------------------

వాయువ్య–పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా–ఉత్తర కోస్తా తీర ప్రాంతాలపై అల్పపీడనం కొనసాగుతోందని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది మరింత బలపడి, ఉత్తర కోస్తా - దక్షిణ ఒడిశా మీదుగా పశ్చిమ–వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వెల్లడించారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్...25 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

=====================